సఫాయి అప్నావో బీమారీ భగావో పోస్టర్ ఆవిష్కరించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

జూలై 31 వరకు నగరవ్యాప్తంగా ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

కరీంనగర్,జూలై 21(వాయిస్ టుడే): వర్షాకాలంలో సీజనల్, అంటువ్యాధులను నివారించడమే లక్ష్యంగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సఫాయి అప్నావో బీమారీ భగావో ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్,మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, మరియు పారిశుధ్య పర్యావరణ శాఖ అధికారులతో కలిసి కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలై 31 వరకు నగరవ్యాప్తంగా ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పలు ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలో రోజువారీ పారిశుధ్య పనులను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్నామని తెలిపారు.నగర ప్రజలు, విద్యార్థులు,స్వచ్ఛంద సంస్థలు, సంక్షేమ సంఘాల భాగస్వామ్యంతో జీ.వి.పి.పాయింట్లు, మార్కెట్లు, బస్టాండ్,రైల్వే స్టేషన్‌లు,ఇతర ప్రజా ప్రదేశాల్లో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి తొలగించడం, చెత్తాచెదారం పూర్తిగా తొలగించడం, డ్రైనేజీల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను శుభ్రం చేయడం,దోమల నివారణ కోసం యాంటీ లార్వా ఆపరేషన్లు, ఫాగింగ్,స్ప్రేయింగ్ వంటి చర్యలను విస్తృతంగా చేపడతామని తెలిపారు.కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్,ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ కమ్యూనికేషన్(ఐఈసి)కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలలు,కళాశాలలు,వెల్ఫేర్ గ్రూపులు,హోటల్,రెస్టారెంట్, మార్కెట్ అసోసియేషన్‌లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి నగర పరిశుభ్రత,సోర్స్ లెవల్ సెగ్రిగేషన్,చేతులు శుభ్రంగా కడుక్కోవడం,వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.నగరంలోని డ్రైనేజీలు,పెద్ద నాళాలు, కాలువలు,ఓపెన్ ప్లాట్లను పూర్తిగా శుభ్రపరచి వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు వ్యర్థాల వేరు చేయడం,డోర్ టు డోర్ చెత్త సేకరణ,సెగ్రిగేషన్,పీపీఈ కిట్ల వినియోగంపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. నగరంలోని పార్కులు, హెరిటేజ్ ప్రాంతాలు,స్ట్రీట్ ఫుడ్ జోన్‌లు,మార్కెట్ ప్రాంతాలు,పట్టణ ఆరోగ్య కేంద్రాలు,అంగన్‌వాడీ కేంద్రాలు,ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరమైన నగరంగా తీర్చిదిద్దడంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం ఎంతో కీలకం అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్,అదనపు కమిషనర్లు ఆయాజ్, సువార్త,అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్,డీఈ లచ్చిరెడి, వెటర్నరీ అధికారి దుర్గాప్రసాద్ రెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్లు స్వామి,రమేష్ పాల్గొన్నారు.

ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం

నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

అసోసియేషన్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్,హెల్త్ కార్డుల పంపిణీ

కరీంనగర్, జూలై 21(వాయిస్ టుడే): సిటీ ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్ మరియు హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్లు,వీడియోగ్రాఫర్లు సమాజంలోని ప్రతి శుభకార్యంలో కీలక పాత్ర పోషిస్తూ అహర్నిశలు శ్రమిస్తున్నారని,వారి సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవడానికి ఇటువంటి వర్క్‌షాప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయనిపేర్కొన్నారు. వృత్తిపరమైన సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు ఐకమత్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఫోటోగ్రాఫర్ల సంక్షేమం కోసం పనిచేస్తున్న వెల్ఫేర్ అసోసియేషన్‌కు తమ పూర్తి సహకారం ఉంటుందని మేయర్ హామీ ఇచ్చారు.అసోసియేషన్‌కు సొంత స్థలం ఉన్నట్లయితే మున్సిపల్ బడ్జెట్ ద్వారా నిధులు కేటాయించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.అలాగే అర్హులైన సభ్యులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు ఇతర ప్రయోజనాలు అందేలా తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు మరియు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని హెల్త్ కార్డులను పంపిణీ చేశారు.అనారోగ్య సమయంలో ఆర్థిక భరోసా కల్పించే ఈ కార్యక్రమం ఎంతో ఆదర్శప్రాయమని,దీని ద్వారా అనేక కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని మేయర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ,గౌరవ అతిథులు వెంకన్న,శ్రీనివాస్ గౌడ్,సీతారెడ్డి, శ్రీకాంత్,నాగేష్, కౌశిక్,శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం

గంగాధార, జూలై 21(వాయిస్ టుడే): పేద మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం అన్నారు.చొప్పదండి నియోజక వర్గంలోని గంగాధర మండలం కొండయ్యపల్లి,ఇస్లాంపూర్, రంగారావుపల్లి గ్రామాలకు సంబందించిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చొప్పదండి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం అన్నారు.

ఓటరు జాబితా ప్రక్షాళన (ఎస్ఐ ఆర్) పై బీజేపీ రివ్యూ

నగరంలోని 40 డివిజన్లలో జరిగిన ఓటరు జాబితా ప్రక్షాళన ప్రక్రియపై విస్తృతంగా సమీక్ష

కరీంనగర్,జూలై 21(వాయిస్ టుడే): నగరంలోని 40 డివిజన్లలో ఓటరు జాబితా ప్రక్షాళన,స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నగర మేయర్ కోలగాని శ్రీనివాస్,డిప్యూటీ మేయర్ సునీల్ రావు,సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్ హాజరయ్యారు.ఈ సందర్భంగా నగర పరిధిలోని అన్ని డివిజన్లలో ఓటరు జాబితాలో ఓట్ల నమోదు, డూప్లికేట్ ఓట్ల వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో జరిగిన పరిశీలనను నాయకులు సమీక్షించారు.అర్హులైన ప్రతి ఒక్క యువతీయువకుడికి ఓటు హక్కు కల్పించే దిశగా బూత్ స్థాయి కార్యకర్తలు మరింత చురుగ్గా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.జాబితాలో ఎటువంటి లోపాలు లేకుండా చూసే బాధ్యత కార్యకర్తలదేనని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యంలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా,అనర్హుల పేర్లు చేరకుండా పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు.నగర అభివృద్ధిలోనూ, ప్రజాస్వామ్య పరిరక్షణలోనూ ప్రతి ఓటూ కీలకమేనని,40 డివిజన్లలో పార్టీ శ్రేణులు చేపట్టిన ఈ ప్రక్షాళన కార్యక్రమం విజయవంతంగా కొనసాగడం సంతోషకరమైన పరిణామనినగర మేయర్ కోలగాని శ్రీనివాస్ అన్నారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను భర్తరఫ్ చేయాలి

నిరసనకారులపై లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగించడం దుర్మార్గమైన చర్య

ఎన్టిఏ ను రద్దు చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు శనిగరపు రజనీకాంత్

కరీంనగర్, జూలై 21(వాయిస్ టుడే): నీట్ పరీక్షల పేపర్ లీకేజీపై ప్రశ్నించిన విద్యార్థులను అమానుషంగా లాఠీచార్జి చేయడం దుర్మార్గపు చర్య అని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు శనిగరపు రజనీకాంత్ అన్నారు.భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జాతీయ కమిటీ పిలుపులో భాగంగా ఆర్ట్స్ కళాశాల నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి,అనంతరం నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు శనిగరపు రజనీకాంత్ హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు శనిగరపు రజనీకాంత్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల పట్ల వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు,యువత ఉద్యమిస్తున్నారని అన్నారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా పోరాడుతున్న విద్యార్థులు,యువతపై పోలీసులు టియర్ గ్యాస్,వాటర్ క్యానన్లు ప్రయోగించి, లాఠీచార్జ్ చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. దేశంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తన కేబినెట్‌లోని మంత్రిని కూడా రాజీనామా చేయించలేని పరిస్థితిలో ప్రధానమంత్రి ఉన్నారని విమర్శించారు. 21 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు కోల్పోయినా కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నాయకత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు.ప్రతి అంశాన్ని "జిహాద్" పేరుతో రాజకీయాలు చేసే బీజేపీ నాయకులు ఈ అంశంపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.రాష్ట్రాల హక్కులను హరిస్తూ విద్యారంగాన్ని కేంద్రీకరిస్తున్న ఎన్ టిఏ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.శాంతియుతంగా పార్లమెంట్ వైపు వెళ్తున్న నిరసనకారులను బారికేడ్లతో అడ్డుకుని,పోలీసులు మరియు సివిల్ దుస్తుల్లో ఉన్న కొందరు వ్యక్తులు విచక్షణారహితంగా కొట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు.అందువల్ల కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోందన్నారు.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగ హక్కులను హరిస్తూ, ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే విధంగా వ్యవహరి స్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు ఈ అంశంపై స్పందించడం లేదని విమర్శించారు.కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ తెలంగాణలో అధికారంలోకి వస్తే ప్రతి విద్యార్థి బొట్టు పెట్టుకుని పాఠశాలకు రావాలని చెబుతున్నారని,కానీ దేశవ్యాప్తంగా విద్యార్థులను ప్రభావితం చేస్తున్న నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులను,యువతను రెచ్చగొట్టడంలో చూపుతున్న శ్రద్ధ దేశ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో కనిపించడం లేదన్నారు.కాబట్టి తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు వెంటనే స్పందించి,నీట్ పరీక్షలో నష్టపోయిన విద్యార్థులందరికీ న్యాయం చేయాలని,గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కంపెల్లి అరవింద్,జిల్లాఉపాధ్యక్షులు వినయ్,ఇసాక్,సహాయ కార్యదర్శి గట్టు ఆకాశ్,గర్ల్స్ కన్వీనర్ మానస, జిల్లా కమిటీ సభ్యులు రోహిత్, రాకేష్ పాల్గొన్నారు.

మంత్రి వివేక్‌ను కలిసిన కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్, జూలై 21(వాయిస్ టుడే): రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర కార్మిక, ఉపాధి, భూగర్భ గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మానకొండూరు నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలు,ప్రజా సమస్యలు,కార్మికులు,ఉపాధికి సంబంధించిన అంశాలపై మంత్రితో ఎమ్మెల్యే సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులనువేగవంతం చేయడంతో పాటు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరగా, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

వికలాంగుల కాలనీలో రూ.19 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

కరీంనగర్,జూలై 21(వాయిస్ టుడే): నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని 21వ డివిజన్ వికలాంగుల కాలనీలో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.19 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వికలాంగుల కాలనీలో నివసిస్తున్న ప్రజలకు మెరుగైన రహదారులు,పారిశుద్ధ్య సౌకర్యాలు,అవసరమైన అన్ని మౌలిక వసతులను దశలవారీగా కల్పించేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందన్నారు.ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తూ నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం,కార్పొరేటర్ వరాల నర్సింగం,మున్సిపల్ అధికారులు,వికలాంగుల సంఘ సభ్యులు,కాలనీ వాసులు పాల్గొన్నారు.

మున్సిపల్ నర్సరీని పరిశీలించిన డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు

కరీంనగర్,జూలై 21(వాయిస్ టుడే):నగరపాలక సంస్థ పరిధిలోని నర్సరీల నిర్వహణ తీరుపై బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి,కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్,మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలోని డ్యామ్ వద్ద ఉన్న మున్సిపల్ నర్సరీలను స్వయంగా సందర్శించి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల క్రితం పట్టణ ప్రకృతి వనాల ఏర్పాటులో భాగంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ నర్సరీలు ప్రస్తుతం పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు.గతంలో ఎంతో అద్భుతంగా,పచ్చదనంతో కళకళలాడిన ఈ నర్సరీలలో ఇప్పుడు సరైన నిర్వహణ లేక వెలవెలబోతున్నాయని అన్నారు. ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో, రాబోయే మాసంలో పట్టణ ప్రజలకు ప్రతి ఇంటికి కనీసం మూడు పూల, పండ్ల మొక్కలను పంపిణీ చేయాల్సి ఉందని అయితే, ప్రజలకు అందించాల్సిన మొక్కల పెంపకంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. నర్సరీల్లో మొక్కల కొరత స్పష్టంగా కనిపిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.మొక్కల పెంపకం మరియు పంపిణీ కోసం ఎటువంటి ముందస్తు సన్నాహాలు చేయకపోవడంపై అక్కడి సిబ్బందిని ఆయన నేరుగా ప్రశ్నించారు.ఈ ఏడాదైనా ప్రజలకు మొక్కలు అందించేందుకు ఎందుకు చర్యలు తీసుకోలేదో, గతంలో జరిగిన విధంగా పంపిణీ ఎందుకు నిలిచిపోయిందో కారణాలు అడిగి తెలుసుకున్నారు.నర్సరీల దుస్థితిని గమనించిన వెంటనే మున్సిపల్ ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడారు.నర్సరీలలో ఉన్న లోటుపాట్లను వెంటనే సరిదిద్దాలని,గత వైభవాన్ని తీసుకురావాలని ఆదేశించారు. త్వరలోనే మున్సిపల్ అధికారులతో కలిసి నర్సరీల నిర్వహణపై కార్పొరేషన్ స్థాయిలో మేయర్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.గతంలో మాదిరిగానే నర్సరీలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి, కరీంనగర్ ప్రజలందరికీ తగినన్ని పూల మరియు పండ్ల మొక్కలు సకాలంలో అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పచ్చదనం పెంపొందించే ఈ కార్యక్రమంలో ఇకపై ఎలాంటి అలసత్వం వహించినా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.